క్లుప్తంగా

సూక్ష్మపోషక లోపాలతో తగ్గుతున్న పంట దిగుబడి

భాకరాపేట : సూక్ష్మ పోషక లోపాలతో పంట దిగుబడి తగ్గుతోందని తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండల కేంద్రాల్లో గురువారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ అవసరానికి మించి రసాయన ఎరువుల వాడకం వల్ల భూమిలో జింకు, బోరాన్, కాల్షియం, ఇనుము తదితర సూక్ష్మ పోషక లోపాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ధనలక్ష్మీ, ఖాదర్‌బాషా, ఆర్‌బీకే విస్తరణ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

10న సాదు సుబ్రమణ్య శాస్త్రి వర్ధంతి

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టులు, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ నెల 10న అన్నమాచార్య కళామందిరంలో సాదు సుబ్రమణ్య శాస్త్రి 42వ వర్ధంతి, గౌరి పెద్ది రామ సుబ్బశర్మ 101వ జయంతిని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు శ్వేత భవనం ఎదురుగానున్న సాదు సుబ్రమణ్య శాస్త్రి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. 10.45 గంటలకు ఎస్వీ ఓరియంటల్ కళాశాలలో గౌరిపెద్ది రామసుబ్బ శర్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 11 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో సభా నిర్వహిస్తారు. అదే విధంగా అన్నమాచార్య కళామందిరంలో సాయంత్రం 6 గంటలకు గౌరిపెద్ది రామసుబ్బ శర్మ 101వ జయంతి సభా కార్యక్రమం నిర్వహిస్తారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హైదరాబాద్‌కు చెందిన శాంత, వసంత ట్రస్ట్ సంయుక్తంగా 13వ తేదీ ఉదయం 9.30 గంటలకు మహతి కళాక్షేత్రంలో శ్రీవేంకటేశ పదములు గ్రంథావిష్కరణ సభ నిర్వహించనున్నారు.

ఉత్తమ అధ్యాపకులకు అభినందనలు


ఉత్తమ అధ్యాపకులను అభినందిస్తున్న వీసీ రాజారెడ్డి

తిరుపతి సిటీ : స్వీ యూనివర్సిటీకి చెందిన ఆరుగురు అధ్యాపకులు ఈ నెల 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశాఖ లో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. వారిని గురువారం వీసీ రాజారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

9 నుంచి జాతీయ సంగీత, సాహిత్య నృత్యోత్సవాలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో శ్రీకృష్ణ దేవరాయ జాతీయ సంగీత, సాహిత్య, నృత్యోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు రంగస్థలి వ్యవస్థాపక అధ్యక్షుడు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి తెలిపారు. ఆయన గురువారం రంగస్థలి కార్యాలయంలో జాతీయ సంగీత, సాహిత్య, నృత్యోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలను రక్షించుకోవడంతోపాటు కళాకారులను ప్రోత్సహించే దిశగా ప్రతి ఏటా రంగస్థలి జాతీయ స్థాయిలో సంగీత, సాహిత్య, నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నిర్వహించే ఉత్సవాల్లో రాష్ట్రం నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వందలాది కళాకారుల బృందాలు పాల్గొననున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, వెంకటేష్, సుబ్రమణ్యంరెడ్డి, కేశవులరెడ్డి, చంద్రబాబు పాల్గొన్నారు.

ఉష సేవలు అనిర్వచనీయం

చంద్రగిరి: మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి సభ్యురాలి ఉషగా విశేష సేవలు అందించారని ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆమె గత నెల 27వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో ఆలయ పాలక మండలి కార్యాలయంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబానికి ఉష, ఆమె భర్త మాజీ ఎంపీటీసీ సీఎం కేశవులు అత్యంత సన్నిహితులుగా మెలిగారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి వారి వెన్నంటే ఉంటూ ఎనలేని సేవలందించారని గుర్తు చేసుకున్నారు. అతి చిన్నవయస్సులో మృతి చెందడం బాధాకరమని, ఆమె లేనిలోటు తీరనిదని ఆవేదన వ్యక్తం చేశారు.

సమాజ సేవకు వేదిక ఎన్‌ఎస్‌ఎస్

తిరుపతి సిటీ : సమాజ సేవకు సరైన వేదిక ఎన్‌ఎస్‌ఎస్ అని ఎన్‌ఎస్‌ఎస్ స్టేట్ ఆఫీసర్ అశోక్‌రెడ్డి తెలిపారు. మహిళా విశ్వవిద్యాలయంలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అడ్వైజరీ సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నిస్వార్థ సేవకులను సమాజం ఎప్పటికీ మరవదని, దానికి తగిన ఫలితం అందిస్తుందన్నారు. అనంతరం వర్సిటీలో వచ్చే ఏడాదిలో చేపట్టనున్న కార్యక్రమాలకు ఆమోదం తెలిపారు. వీసీ భారతి, రిజిస్ట్రార్ రజిని, మాజీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కాత్యాయిని, డీన్లు సుజాతమ్మ, అనురాధ, విద్యావతి, 16 యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిన్ని కృష్ణా నిన్ను చేరి కొలుతు..


విశ్వగిరి శ్రీకృష్ణ మందిరంలో పూజలు చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పక్కన సోంప్రకాష్




చిన్ని కృష్ణుడి వేషంలో చిన్నారి, ఇస్కాన్ మందిరంలో విశేషాలంకరణలో అష్టసఖులతో శ్రీకృష్ణుడు

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో గురువారం శ్రీకృష్ణాష్టమిని ఘనంగా జరుపుకున్నారు. శ్రీకృష్ణుడి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా పిల్లలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. చిన్ని కృష్ణా నిన్ను చేరి కొలుతు అంటూ భక్తిని చాటుకున్నారు.

విశ్వగిరిలో ఘనంగా ఉట్లోత్సవం

తిరుపతి రూరల్: కుంట్రపాకం విశ్వగిరిలోని శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన ఉట్లోత్సవంలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని యువకులతో కలిసి ఉట్టి కొట్టారు. అనంతరం కేసీపేట, కుంట్రపాకం, నాగూర్‌కాలనీకి మూడు ఆధ్యాత్మిక రథాలను ప్రారంభించారు. టీటీడీకి చెందిన అన్నమాచార్య కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సోంప్రకాష్, మాజీ ఆర్టీఓ బాబయ్య, మాజీ సర్పంచ్‌లు బుజ్జిరెడ్డి, రాణెమ్మ, మహేశ్వరి, అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు.

కపిలతీర్థంలో..

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయ అనుబంధ వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం గోకులాష్టమిని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకం చేశారు. సాయంత్రం వీధి ఉత్సవం, గోకులాష్టమి ఆస్థానం నిర్వహించారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడి విద్విలాసం

చంద్రగిరి: కృష్ణాష్టమి, రోహిణి నక్షత్రం సందర్భంగా గురువారం శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ అనుబంధ శ్రీకృష్ణ ఆలయంలో గురువారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణుడు రుక్మిణి, సత్యభామతో కలిసి బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పాకాల : మండలంలోని చెన్నుగారిపల్లిలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఇస్కాన్ మందిరంలో..

తిరుపతి తుడా: గోకులాష్టమి సందర్భంగా తిరుపతిలోని ఇస్కాన్ మందిరంలో విశేష పూజలు చేశారు. అష్ట సఖి సమేత రాధాకృష్ణులను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా గోపూజ


ఇస్కాన్ మందిరంలో స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు

రామచంద్రాపురం: మండలంలోని నడవలూరులో గురువారం పంచమిత్ర సేవాసమితి ఆధ్వర్యంలో గోపూజ చేశారు. గోవులను అలంకరించి నైవేద్యంగా పండ్లు సమర్పించారు. మహిళలు, యువతకు ప్రత్యేక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే రామాపురం సమీపంలోని గోవర్ధనగిరిలోని చిన్మయ వేణుగోపాలస్వామి ఆలయంలోని స్వామికి తిరుమంజన సేవ చేశారు.

పెద్దశేష వాహనంపై శ్రీకృష్ణుడి విహారం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణుడు గురువారం రాత్రి పెద్దశేష వాహనంపై విహరించారు. గురువారం ఉదయం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.


బంగారు తిరుచ్చిపై ఊరేగుతున్న రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడు



రుక్మిణి సత్యభామ సమేత పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీకృష్ణుడు

చురుగ్గా అభివృద్ధి పనులు


రోడ్డు పనుల పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం తిలక్ రోడ్డు–నవాబుపేట రోడ్లను కలుపుతూ చేపట్టిన కనెక్టివిటీ రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధితో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని వివరించారు. ఈ క్రమంలోనే జబ్బార్ లేఅవుట్ మీదుగా కనెక్టివిటీ రోడ్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీటీడీ పరిపాలన భవనం దక్షిణం వైపున కాలువపై రోడ్డు వేసి 30 అడుగుల రహదారిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో తిరుపతి మరింత అభివృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ మహేష్, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ వెంకటేష్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జి ఉదయ వంశీ, పులికంటి గోపీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

వడ్డెర్లకు రాజకీయ అవకాశాలు కల్పించాలి


మాట్లాడుతున్న పీఠాధిపతి ఇమిడి సిద్ధ రామేశ్వర స్వామీజీ

తిరుపతి కల్చరల్: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వడ్డెర సామాజిక వర్గానికి అన్ని పార్టీలు రాజకీయంగా అవకాశాలు కల్పించాలని చిత్రదుర్గ జగద్గురు సిద్ధ రామేశ్వర మహా సంస్థాన వడ్డెర గురుపీఠం, పూణే సిద్ధ రామేశ్వరస్వామిజీ పీఠాధిపతి ఇమిడి సిద్ధ రామేశ్వర స్వామీజీ విజ్ఞప్తి చేశారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన ఆయన గురువారం పెద్దకాపు లేఔట్‌లోని అంజేయస్వామి ఆలయం సమీపంలోనున్న మోహన్ మ్యాన్ పవర్ సెక్యూరిటీ ఏజెన్సీస్ కార్యాలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు సెక్యూరిటీ ఏజెన్సీస్ ఎండీ జె.మోహన్, వడ్డెర సంఘం నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనాదిగా వృత్తిపై ఆధారపడి జీవించే వడ్డెర్లు జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్లను చైతన్యపరిచి వారి రాజకీయ ఎదుగుదలకు కృషి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే నెలలో రాష్ట్రంలో వడ్డెర్లందరిని ఐక్యపరిచి భారీ స్థాయిలో సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఓసీసీబి ప్రతినిధులు, వడ్డెర సంఘ నేతలు వెంకటేష్, రమణ, శేఖర్, శ్రీనివాసులు, అమరనాథ్, బాలాజీ, సురేష్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ


మనోజ్‌కుమార్‌కు పెళ్లి కానుక అందజేస్తున్న లక్ష్మీనారాయణ

చంద్రగిరి: మండలంలోని కొత్తశానంబట్లకు చెందిన కృష్ణప్రసాద్, చంద్రుప్రియకు వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని గురువారం వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, నాయకులతో కలిసి అందజేశారు.

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ టంగుటూరివాండ్లపల్లెకు చెందిన నూతన వరుడు లోకేష్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని గురువారం ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, సర్పంచ్ మాధవి, మనోహర్, భాస్కర్‌రెడ్డి, తదితరులు అందజేశారు.

తిరుపతి మంగళం : మంగళం రణధీర్‌పురం పంచాయతీ బీటీఆర్‌కాలనీకి చెందిన నూతన వరుడు మనోజ్‌కుమార్‌కు ఎమ్మెల్యే చెవిరెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని గురువారం వైఎస్సార్‌సీపీ పంచాయతీ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, వార్డు మెంబర్లు సతీష్, మురళి, సురేంద్ర, సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ ఏపీఆర్వో రెడ్డెప్ప అందజేశారు.




పెళ్లి కానుక అందజేస్తున్న నాయకులు, పెళ్లి కానుక అందజేస్తున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి

వీనులవిందుగా కీచక వధ హరికథా గానం


కీచక వధ హరికథను గానం చేస్తున్న భాగవతారిణి సీతాలక్ష్మీ

రామచంద్రాపురం: మండలంలోని ఎస్‌ఆర్ కమ్మపల్లి సమీపంలో ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజులు ఆలయంలో 57వ మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం భాగవతారిణి సీతాలక్ష్మీ కీచక వధ హరికథను గానం చేశారు. అనంతరం ఆలయంలోని ద్రౌపది సమేత ధర్మరాజులు మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. తిరుపతికి చెందిన వెంకటరత్నం నాయుడు, మునిరత్నం కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు, అర్చకులు హరి ఆచారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత వైద్య సేవలు

తిరుపతి తుడా: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో శ్రీ సాయి సుధా మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత వైద్య సేవలు చేస్తున్నట్టు ఆస్పత్రి ఎండీ డాక్టర్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

లక్ష్య సాధనకు కఠోర శ్రమే ఆయుధం

తిరుపతి సిటీ : విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించాలంటే కఠోర శ్రమను ఆయుధంగా ఉపయోగించాలని తిరుపతి ప్రివెంటివ్ డివిజన్ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్ శోభన్ బాబు పిలుపునిచ్చారు. ఎస్వీయూ కామర్స్ విభాగంలో గురువారం సీనియర్ విద్యార్థుల ఫేర్‌వెల్ నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థి దశ కీలకమైందని, శ్రమ కొద్ది ఫలితం ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్ణయించుకుని దాని సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసయ్య, విభాగపు అధిపతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా యూనివర్సిటీ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సైకాలజీ విభాగాధిపతి గాయత్రి, అధ్యాపకులు రజిని, బేబీ, మాధవి పాల్గొన్నారు.

హైటెక్ నిసాన్ మెగా ఉచిత సర్వీస్ క్యాంప్


క్యాంప్‌ను ప్రారంభిస్తున్న సంస్థ జీఎం ఎన్‌వీఎస్.శాస్త్రి, ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని సీజేఎస్ హైటెక్ నిసాన్ ఆధ్వర్యంలో కస్టమర్ల సౌకర్యార్థం గురువారం మెగా ఉచిత సర్వీస్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎన్‌వీఎస్. శాస్త్రి మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో వాహనాలకు వాటర్ సర్వీస్, జనరల్ చెకప్ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్ శుక్రవారం కూడా ఉంటుందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 60 మందికి ఉచిత సర్వీస్ అందించారు. కంపెనీ ఎండీ సి.జగన్నాథరెడ్డి, డైరెక్టర్లు సి.నిరంజన్, హోషిమారెడ్డి, సర్వీస్ మేనేజర్ రాము పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే వస్తువులు విక్రయించాలి


మాట్లాడుతున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఎమ్మార్పీకే వస్తువులను విక్రయించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని దుకాణదారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎమ్మార్పీకంటే అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఆర్టీసీ నిర్ణయించిన మేరకే విక్రయించాలని, లేనిపక్షంలో దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. బస్టాండ్‌లోని హోటల్స్ నిర్వాహకులు నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, పర్సనల్ ఆఫీసర్ పార్థసారథి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎస్వీయూ విద్యార్థి


మామిళ్ల బాలాజీని సన్మానిస్తున్న వీసీ రాజారెడ్డి, అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ఎల్‌ఎల్‌బీ 2016–21 బ్యాచ్‌కు చెందిన విద్యార్థి మామిళ్ల బాలాజీ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఆయన 2022 రాష్ట్ర జడ్జీల నియామక పరీక్షలో మొదటి ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఆయనను గురువారం ఎస్వీయూ వీసీ రాజారెడ్డి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. న్యాయశాస్త్ర విభాగం అధ్యాపకులు అభినందించారు.

రేపు జిల్లా స్థాయి టీ-20 క్రికెట్ జట్ల ఎంపిక

పాకాల : మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం జిల్లా స్థాయి టీ–20 క్రికెట్‌కు సంబంధించి అండర్–19, సీనియర్ జట్లను ఎంపిక చేయనున్నట్లు టి–20 క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.అద్వైత్ తెలిపారు. వివరాలకు 9701515415, 8179926549లో సంప్రదించాలని సూచించారు.